
**వితంతు స్త్రీల సమస్య కొడుకు పెరిగి పెద్దవాడై తల్లిని ఆదుకునేవరకూ యిప్పటికి ఒకలానే వుంది అయితే మనం సాధించిన ప్రగతి సముద్రంలో నీటిబొట్టేనా?**

అరుణాతార

# 'జ్యేష్ఠ'



చంటి పిల్లాడి ఏడుపు విని నిద్దట్లోనే ఏవో కిలల్లాంటి ఆలోచనలతో కుమిలి కుమిలి ఏడుస్తున్న వసుంధర వులిక్కిపడలేచి కూర్చుంది. ఇంకా బెక్కుతూనేవున్నకొడుకుని ఒళ్ళోకి తీసుకుని పాలివ్వడం మొదలెట్టిందికాని. కల ఇంకా సాగుతూనే వుంది. తనని చుట్టాలూ. ఊళ్ళోవాళ్ళూ "వితంతువు" అని తిడుతున్నారు. తన భర్త ఎక్కడికో వెళ్ళాడు. "కాదు. వాడు చచ్చిపోయాడు. నీ దరిద్రపు రాత వల్లే నీ మొగుడికి చావొచ్చింది" అంటున్నారు వాళ్ళు. తను నమ్మలేకపోయింది. ఎంత నిర్దాక్షిణ్యంగా తిట్టారు వాళ్ళు! వాళ్ళతో చేతనైనెట్లు వాదించింది తను కాని వాళ్ళ—

అంతవరకూ పాలు తాగుతున్న రవి తన రొమ్మునించి మొహం తిప్పేసి "కా.... గా...." అంటూ గట్టిగా పాట మొదలెట్టడంతో వసుంధరకి పూర్తిగా మెళకువ వచ్చింది. ఓ సారి కొడుకునీ. పరిసరాల్ని

చూసింది. దాదాపు తెల వారింది చీకట్లు నెమ్మదిగా జారుకుంటున్నాయి.

ఒక్కసారి తను నిజంగా వితంతువేనని మెరుపులా తోచింది వసుంధరకి. భారంగా నిట్టూర్చి ఊరుకుంది. రవి పాట ఆపి తల్లి ముఖంలోకి చూస్తూ నవ్వుతున్నాడు.

వసుంధర మొగుడు శ్యామలరావు చనిపోయి ఆరునెలలయింది. వసుంధర కిప్పుడు పాతికేళ్ళు. పెద్దకొడుకు రాంబాబుకి ఎనిమిదేళ్ళు, రెండోవాడు రవికి ఎనిమిది నెలలు. ఇప్పుడు పుట్టింట్లోనే వుంటోంది ఆమె.

వసుంధర పెళ్ళి జరిగినప్పుడు ఆమె అత్తవారు భాగ్యదేవత అన్నారామెని. ఆమె రాకతో వాళ్ళ చితికిపోయిన కుటుంబం మళ్ళీ పైకి రాసాగిందిట. శ్యామలరావు సరేసరి. "పువ్వుల్లో పెట్టి పూజించాలి" అన్నట్లు వసుంధరని ఎంతో ప్రేమగా గౌరవంగా ఏలుకున్నాడు. "నువ్వే నా ప్రాణం" అనేవాడు. ఇప్పుడు తన ప్రాణంలాంటి వసుంధరని భూమ్మీద వదిలేసి ఎందుకు మట్టిలో కలిసిపోయాడో! అందుకే మనుషుల్ని ఎంత గొప్పవాళ్ళైనా సరే నమ్మకూడదంటారు కొందరు.

వసుంధర పుట్టింట్లో ఆమె అన్న, తమ్ముడు, ఇద్దరు పెళ్ళికాని చెల్లెళ్ళు, తండ్రి వున్నారు. ఆమె అన్న ప్రకాశరావుకి పిల్లల్లేరు. తమ్ముడు కమలాకర్‌కి ముగ్గురు పిల్లలు.


శ్యామలరావుతాలూకుఇన్సూరెన్స్‌డబ్బు, రేడియో, ఫర్నిచర్ అన్నీ అతనివాళ్ళే వుంచేసుకున్నారు; జ్ఞాపక చిహ్నం కావాలిట వాళ్ళకి. తర్వాత వసుంధర ఏదైనా ఉద్యోగం వెతుక్కుంటానంటే పుట్టింటివాళ్ళు ఒప్పుకోలేదు.


"మీ కెందుకు నా బరువు" అని ఆమె అంటే "పరువు తియ్యకు ఇష్టం వచ్చినట్లుచేసి" అని నొచ్చుకున్నారు వాళ్ళు.

అందాల బొమ్మ వసుంధరకి వైధవ్యపు మసి త్వరగానే అలుముకుంది. ఎందుకంటే పుట్టింటికి వచ్చాకా వంటగదే ఆమె నివాసం అయింది. వదినలకి ఇతర "డ్యూటీ"లు పెరిగిపోయాయి. పెద్ద వదినకి పిల్లల్లేరు కనుక దానికోసం కృషి ఎక్కువైంది. చీటికీ మాటికీ గుళ్ళూ, యాత్రలూ, స్వాములార్ల పాదపూజలూ చేస్తోంది. చిన్న వదిన విమలాదేవికి బ్లడ్‌ప్రషర్. నరాల బలహీనత మొదలైన సడికట్టు పదాలమీద మోజు పెరిగి, ఇంజక్షన్లు, టాబ్లెట్లూ భోజనంగా తినసాగింది.

ఇంటి చాకిరీ అంతా చేసినందుకు వసుంధరకి మెప్పూ, గౌరవం వంటి అదనపు బరువుకూడా తగిలించడం ఎందుకని


ముచ్చటగొలిపే మృదువైన టెరెక్సు సూటింగులు
టెక్సులిన్ షర్టింగులలో
పెండ్లి కుమారుని దర్జా చూడండి
దయచేయండి
VIMAL A RELIANCE PRODUCT
షోరూం, ఆరాధన
కొత్తగూడెం
(శ్రీ లక్ష్మి వారి అనుబంధ సంస్థ)
B.A.P.




నిర్లక్ష్యం చేసేవారు ఇంటిల్లిపాదీ. తమతో సినిమాలకీ, షికార్లకీ పిలిచి ఆమెను శ్రమ పెట్టడమూ ఇష్టం వుండేది కాదు వాళ్ళకి.

భర్త చనిపోయిన సత్యం క్షణం క్షణం వాళ్ళ ప్రవర్తనా, మాటలూ గుర్తు చేయడంతో "నేను నిజంగానే వితంతువుని" అనుకోసాగిందామె. భర్తనించి వచ్చే సుఖాలు ఎలాగూరావు. తనకి అవి అక్కర్లేదేమో. కాని ప్రతిమనిషికీ కావలసిన స్నేహం, ఆదరణకూడా తాను పొందే హక్కు లేదని సూచనగా తెలుస్తోందిఆమెకి.

వితంతువు అంటే కుష్టువ్యాధి వచ్చిన స్త్రీ అని ఏదైనా నిఘంటువులో వుందేమో! ఇంట్లో పెద్దలూ, పిన్నలూ అలాగే భావిస్తున్నట్లుంది. వదినలు ఆమెకు వినపడేలాగే అవహేళనగా మాట్లాడేవారు తన గురించి. ఓ రోజు "ఆ మొహం చూశావా విమలమ్మా! ఎంత ప్రేతకళో. అందుకే మొగుడు ముప్పై ఏళ్ళు నిండకుండా పోయాడు" అంది పెద్ద వదిన, చిన్నది విమల కిసుక్కున నవ్వి "నిజం అక్కా. ఒక్కోప్పుడు నిద్ర లేవగానే దాని మొహం చూసేయోగం పడుతుంది. ఇంక ఆ రోజు చూడు నాపాట్లు. అన్నీ దరిద్రమైపోతాయి. అందుకే పూర్వీకులు—"

"శుభకార్యాలు జరిగే చోటికి రానిచ్చేవారు కాదు. ఇప్పుడంతా కలికాలం. అన్నీ పోతున్నాయి." అంది పెద్ద వదిన.

"బావిలో దూకితే...." అనిపించింది వసుంధరకి, ఆ రోజు ఆమె తిండి తినలేదు. ఎవరికీ ఆ సంగతి తెలియలేదు.

నిజంగా వేదం చదివిన ఓ శాస్త్రుల్లుగారిని ఓ రోజున ఇంటికొస్తే నిలేసి ఎదురుగా అడిగింది వసుంధర. "మీకు అన్నీ తెలుసంటారు. మీరు చెప్పండి. నా మూలాన్నే మా ఆయన చచ్చిపోయారా అని-"

ఈ రోజుల్లో ఇలాంటి ప్రశ్నలు అడిగే వాళ్ళు లేక మొహంవాచిన ఆయన శాస్త్రజ్ఞానం ఒక్కసారి పాములా పడగెత్తి ఆడింది. కొంతసేపు ఆమెను ఓదార్చి అమ్మా! ఎవరి కర్మ వాళ్ళది. ఎవరికెంత ఋణమో అన్నాళ్ళు భూమ్మీద ఉంటారు. దాంటో మనుషులదేకాదు. ఆఖరికి దేవతల జోక్యం కూడా వుండదు. అదీ కర్మ సిద్ధాంతం. నీ మొగుడు కాలం చేశాడంటే ఊరికే చేశాడంటావా? అమ్మో. ఈ జీవుడు పైకి ఎంత నికృష్టంగా కనిపిస్తాడు కాని, దేవాంతకుడు. మరో శరీరం వెతుక్కొని గాని ఈ శరీరాన్ని విడిచి పెట్టడు. అంచేత గతించిన మీ భర్తగారు స్వర్గంలో నీ కోసం ఎదురు చూస్తూ ఉంటాడనీ, నీకు ఉత్తరాలు రాస్తాడనీ ఆశలు పెట్టుకోకు. నీ కెన్నేళ్ళు ఆ అదే అనుకున్నాను. పాతిక. కొందరు పిల్లలకీ అదే పెళ్ళీడు. మళ్ళీ పెళ్ళి చేసుకో అమ్మా. ఏమీ తప్పులేదు" అన్నాడాయన. ఆయనకి ఛంబాళ్ నశ్యం పీల్చినంత హుషారుగా వుంది ఆమెకు కర్మ సిద్ధాంతాన్ని చెప్తున్నప్పుడు.

ఆ సంభాషణతో కొంత ఊరట చెందిన వసుంధర తిరిగి మనిషిలా బతకసాగింది. రేడియోలో పాటలు వస్తుంటే (ఆమె బాగా పాడుతుంది. నువ్వు ఇక్కడ వుండిపోబట్టి నూర్జహాన్, లతా పైకొచ్చారు అనేవాడు మొగుడు.) వినడం మొదలెట్టింది. విచారంగా వుండడమూ, ఏడుస్తున్నట్లు మాట్లాడ్డమూ "పెద్ద మనిషి" తరహా కాదని నిశ్చయించుకుంది. కృత్రిమ భావాల మేకప్‌లో మునిగిపోయిన ఆమె జవసత్వాలు తిరిగి పైకి రాసాగాయి. కళ్ళలో "విడో లుక్" పోయి మునుపటి కాంతి వచ్చింది.

వసుంధర పెద్ద వదిన రంగనాయకమ్మ నీళ్ళోసుకుంది. ఓ రోజున సీమంతం ఏర్పాట్లు జరుగుతున్నాయి. వసుంధర ఆ గదిలోకి వెళ్ళి సాయపడబోతే అందరూ (అన్నతో సహా) మొహం చిట్లించారు. చిన్నవదిన ఆమెను బయటకు లాక్కుపోయి కోపాన్ని అణుచుకుంటూ "శుభమా అని సీమంతం చేస్తుంటే నువ్వెందుకమ్మా అక్కడ? నీ పాడు మొహం చూపించి

మొత్తం 38 గల నమూనా

## ఈ సంవత్సరపు బంపర్ ఆఫర్

(ట్రాన్సిస్టర్ల అమ్మకము పెంచుట కొరకు పథకం)

| | | | |
|---|---|---|---|
| 8 | 13 | 6 | 11 |
| 17 | 2 | 15 | 4 |
| 10 | 9 | 12 | 7 |
| 3 | 14 | 5 | 16 |

మొదటి బహుమతి : మొత్తం సొల్యూషన్ సరియైనది అయినచో ఒక వెయ్యి నగదు. రెండవ బహుమతి : పై మూడు అడ్డ వరుసలు సరియైనవి అయినచో అయిదు వందలు నగదు. మూడవ బహుమతి : సోని సూపర్ డీలక్స్ 3 బ్యాండ్ ట్రాన్సిస్టర్ 250 లేదా ఎక్కువ ఎంట్రీదారులకు ధర : 270/-లో సగం ధరపై.

నిబంధనలు : 1. ఖాళీ కాగితముపై 3 నుండి 18 వరకుగల అంకెలను ఒకేసారి ఉపయోగించి ఎటుకూడినా మొత్తం 42 వచ్చునట్లు వేయాలి. 2. సీల్డుసొల్యూషన్ మా కార్యాలయమందుంచబడినది. అది ఎమ్. డి.చే స్వయంగా తెరువబడును. 3. ఈ పోటీకి ఎంట్రీ ఫీజు లేనందువల్ల మొదటి మరియు రెండవ బహుమతులు మా సీల్డు సొల్యూషన్‌తో సరిపోయినప్పుడు మాత్రమే ఇవ్వబడును. అట్లు లేనియెడల మొదటి రెండవ బహుమతులుండవు. 4. మూడవ బహుమతి గెలుపొందినవారికి పోస్టేజీ,ప్యాకింగ్ ఇన్సూరెన్సు లెదర్ కేస్ ఖర్చులు మొదలయినవి ఖర్చులుచెల్లించాలి. మూడవ బహుమతి గెలుపొందినవారికి నగదు బహుమతులుండవు. 5. ఒక ఎంట్రీదారుడు ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి. 6. ఏదేని వివాదములుఆలీఘర్ సివిల్ కోర్టునందు మాత్రమే 7. మీఎంట్రీలు హిందీ లేక ఇంగ్లీషులో మాత్రమే పంపాలి.

ముగింపు తేదీ: 24-4-78 ఫలితం : 26-4-78

MAYUR TRADERS (AJS-42) P. B. 95, ALIGARH-.

అంతా వాడుచేయాలనా" అంది సన్నని గొంతుతో.

ఆ రాత్రి ఏడుస్తూ నిద్రపోయిన వసుంధర తెల్లవారుతుంటే ఇంకా ఏడుస్తూనె వుంది. కలల్లో మాత్రం ఇదంతా కల. తన భర్త చనిపోలేదు అనుకుంటూవుంటే చంటి పిల్లడు గట్టిగా ఏడ్చి కల ఆర్పేశాడు.

ఇంటి పనుల్లోకి దిగిన వసుంధరకి పెద్ద బ్బాయి రాంబాబే తోడు. వాడు వస పిట్టలా వాగుతాడు. వాడి మాటలు వింటుంటే తను తల్లేగాని వితంతువు కాదనిపించి వసుంధర మనిషిలా అయిపోతుంది. తల్లే దైవం అన్నారు. కాని ఆ తల్లికి పిల్లలే దైవాలయ్యారు.

శీమంతం జరిగిన మర్నాడు ఉదయం రంగనాయకమ్మ లేస్తూనే పొత్తి కడుపు నెప్పి అని గోల పెట్టింది. కొంచెం రక్త స్రావం కూడా మొదలెట్టగానె "అమ్మో ఎబార్షన్" అని అరిచి మూర్ఛపోయింది తోడికోడలు. మూర్ఛపోవడంలో ఆమెకు మంచి ప్రాక్టీస్ వుంది.

ఓ కుర్ర లేడీ డాక్టరు వచ్చి ఇంజెక్షనూ. టాబ్లెట్లూ ఇచ్చి పెద్ద ఆరిందాలా టక్కు మొహం వేసుకున్న రంగనాయకమ్మ మొగుణ్ణి మొహం వాచేలా తిట్టింది "ఏమండి మీకు తెలీదా ఇన్నేళ్ళొచ్చి. ఈ వయస్సులో ఈమెకి ప్రథమ గర్భం వచ్చిందంటే ఎంత కేర్‌ఫుల్‌గా వుండాలి. ఇది ఎటు దారితీస్తుందో చెప్పలేం" అని రెండు జడలూ ఎగరేసుకుంటూ వెళ్ళిపోయింది.

"మూర్ఛ"లోనే అంతా వింటున్న చిన్న కోడలు టకామని నాటకం తెర వెయగానె లేచి నిలబడ్డ శవం వేషధారిలా లేచి" డిగ్రీలుండగానే సరా. నీకేం తెలుసమ్మా మా గొడవలు. నిన్న సీమంతం చేస్తుంటే మా విధవాడబడుచు ఆ గదిలో కొచ్చిందా లేదా? అవ్వ: చెప్పుకుంటే అప్రతిష్ట. తన పాడు మొహం చూపించింది. అంతే. ఈ వేళ పొద్దున్నే ఈ విపరీతం" అంటూ వచ్చింది ఆ గదిలోకి. లేడీ డాక్టరు లేకపోవడంతో నిరుత్సాహపడినా వెంటనే తెప్పరిల్లి గాలిని తిట్టసాగింది. "ఎవరి బతుకు వాళ్ళు బతక్కుండా ఈపాడు సంత ఒకటి మనకి. కలో. గంజో ఏవో తినే వాళ్ళం ఇన్నాళ్ళూ. ఇప్పుడీ విధవాడపడుచుతో—" అలా సాగిపోయింది తుఫాను.

వసుంధర చెవులు మూసుకుంది. ఆందోళనతో తలంతా హోరు వినిపిస్తోంది. ఇక్కడ వుండరాదు అనుకుంది. తనకి ఏం రాసి పెట్టుందో అదే జరుగుతుంది. శాస్త్రుల్లుగారు చెప్పారుగా శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదని. తోడబుట్టినవాళ్ళు అనే లేబిల్ తనకేమీ అమృతాన్నివ్వలేదు. వీధిలో బతికితే ఇంతకంటే సుఖమేమో!

రంగనాయకమ్మకి ఎబార్షన్ కాలేదు అని రూఢి అవగానే ఓ చీటీ రాసిపెట్టి వెళ్ళి వితంతు శరణాలయంలో చేరబోయింది. కాని ధర్మ సంస్థల్లో బతికే మనుషుల అవస్థ చెడి పుట్టింటికి వచ్చిన ఆడదాని అవస్థకన్నా హీనం అని తెలిసి ఏవో పనులు చేసుకు బతకడానికి నిశ్చయించుకుంది ఆమె.

* * *

"నేను యాచన కోసం రాలేదు." తల వంచుకుని నిలబడి సన్నగా అంది వసుంధర. జమీందారుగారు పిన్న వయస్కుడు. కాని వాళ్ళ తండ్రి కాలం నించీ రాజమండ్రిలో ఓ పేద కాలేజీ విద్యార్థుల ఉచిత భోజనశాల. స్కాలర్‌షిప్‌లూ ఇచ్చే సంప్రదాయం వుండేమో అందరూ సహాయం




ఏడ్పు నుండి
ఉల్లాసానికి

పెరిగే పాపలకు అజీర్ణం చేయడమనేది సహజం మీపాపను అజీర్ణంనుండి ఉపశమనాన్ని కల్గించి ఉల్లాసంగా ఉంచేందుకు బయో - సాల్‌ను నమ్మండి. ఇంకేమాత్రం ఏడ్పువుండదు. బయో - సాల్‌కు కృతజ్ఞతలు చెప్పండి.

బయో-సాల్®

గ్రైప్ - మిక్చర్

మీపాపలను సంతోషంగా మరియు ఉల్లాసంగా నుంచుతుంది

J. & J. DeChane India

జె. & జె. డిషేన్
ల్యాబొరేటరీస్ (ప్రైవే.) లిమిటెడ్
హైదరాబాద్, ఇండియా

మా పజిల్స్ పోటీలలో పాల్గొని ఆకర్ష
ణీయమైన నగదు బహుమతులను గెలు
పొందండి. బహుమతులు గ్యారంటీగా
నేషనలైజ్డు బ్యాంకు ద్వారా పంపబడును.
మరియు
"గెలవండి – నష్టము లేదు"
అనెడి స్కీములో చేరి, మీరు బహుమతు
లను గెలుపొందలేక పోయినను. కనీసం
మీ పెట్టుబడికి ఎటువంటి నష్టం రాకుండా
చూడండి. వివరములకు, ఏజన్సీలకు,
ఎంట్రీ ఫారములకు దిగువ అడ్రసునకు
వ్రాయండి–
TRIMURTI ENTERPRISES
(P.o) MIHIJAM-815354 (Bihar)

డా॥ పి.వి.కె.రావ్, B.A., సెక్స్ స్పెషలిస్ట్



వైద్యవిద్వాన్ – వైద్యాచార్య. హస్తప్రయోగం, నరముల బలహీనత, అంగముచిన్నదిగుట, శీఘ్రస్కలనము–శుక్లనష్టము. సుఖ రోగములకు మానసిక వ్యాధులకు ఆయుర్వేద చికిత్స. పోస్టుద్వారా కూడా చికిత్స గలదు.
రావూస్ క్లినిక్
టి. బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700

SUVARNA

ఉచితము ఉచితము ఉచితము
తెల్ల మచ్చలు
మా వైద్యము ద్వారా తెల్లమచ్చ రంగు
సమూలంగా త్వరితగతిని మామూలుగా
మార్చును. మా వైద్యము ఎంత సఫల
మైనదో పరీక్షచేసి చూడండి. రోగ వివ
రములు మాకు వ్రాసి ఒక ప్యాకెట్టు
మందు ఉచితంగా తెప్పించుకోండి.
తెల్ల వెంట్రుకలు
పొగద్త కాదు, మా ఆయుర్వేద తైలము
వాడుటవలన వెంట్రుకలు తెల్లబడుట ఆగి
పోయి సమూలంగా నల్లగా మార్చును.
ఈ తైలము మెదడు మరియు కండ్ల బల
హీనతలకు లాభదాయకమైనది. వేలమంది
ప్రజలు దీనిని వాడి, లాభము పొంది
యున్నారు. ఒక సీసా వెల రు. 10/–
3 సీసాల వెల రు. 28/–పోస్టేజి అదనం
MRITYUNJAY SUDHA
OWSHADHALAYA,
(A.J) (P.o) Katrisari (Gaya)

కోసం రావడం ఆయనకి బాగా తెలుసు.

"మరెందుకమ్మా"

"నాకు యిద్దరు పిల్లలు. నాకు తల్లీ తండ్రీ. అన్నా. తమ్ముడూ ఉన్నారు. వాళ్ళని వాళ్ళే పోషించుకుంటున్నారు. మీరు మీ పాడుపడిన గుర్రాలశాలలో నాకు కాస్త నీడ ఇస్తే నేను నాలుగిళ్ళలో చేతనైన పనులు చేసుకుని బతుకుతాను."

ఈ చిన్న రిక్వెస్ట్‌తో జమిందారుగారి గాభరా తగ్గింది. "అలాగే వుండవమ్మా. దానికి పెంకులుకూడా లేవు. వేయిస్తాను" అన్నాడు.

వసుంధర చేతులు జోడించి వెళ్ళిపోతుంటే జమీందారు ఇంట్లో భోజనం చేస్తేకాని వెళ్ళనీయనన్నాడు.

వసుంధర మొహం చూడగానే జమీందారిణికి సద్భావం ఏర్పడింది. వాళ్ళ వంటవాళ్ళు పచ్చి దొంగలు. రోజూ పచారీ సామాన్లూ అడపా దడపా పాత్రలూ, బట్టలూ దొంగిలిస్తుంటారు. వసుందర కంటే చిన్నది అయిన ఆ యిల్లాలు "అమ్మాయీ. నువ్వు ఎవరింటికీ వెళ్ళక్కర్లేదు. ఆ పను లేవో మా యింటిలోనే చేస్తూవుండు" అని ఆర్డర్సు వేసింది.

మునపట్లాగానే తనకి వంట ఇంట్లో తోడుపడుతున్న రాంబాబుని రామ్మకి హత్తుకుని "వద్దు నాన్నా. నువ్వు రేపట్నించి బడికి వెళ్ళాలి. రెండో క్లాసు పుస్తకాలు తీసుకుని వెళ్ళు రేపుదయం" అంది వసుంధర. చంటి వాడికి పాకడానికి జమీందారు భవంతి చాలా అనువుగా వుంది.

* * *

లేవగానే తల్లి ముఖం చూడ్డం పిల్లలకి అలవాటు. ఓ రోజు నిద్రలేస్తూనే రాంబాబు తల్లితో మాట్లాడుతూ "అమ్మా! నువ్వు దేవుడివిటగా" అన్నాడు.

అదిరిపడి "ఎవరు చెప్పార్రా" అంది వసుంధర. క్షణంలో తను మరిచిపోయిన వైధవ్యం, తన "వెధవ మొహం" మీద అందరూ విసిరిన బాణాల దెబ్బలు గుర్తొచ్చాయి ఆమెకి. బాధతో విలవిల్లాడి పోయింది.

స్కూల్లో టీచర్ చెప్పారు. "మాతృదేవోభవ" అని వేదాల్లో ఉందట.

"స్కూలువేరు. ఇల్లు వేరు. అక్కడివన్నీ ఇక్కడ పనికిరావేమో" ఆనందాన్ని అణచే ప్రయత్నంచేస్తూ తాపీగా అంది వసుంధర.

"కాదమ్మా అలాగే వుండాలిట. నిద్రలేవగానే తలిదండ్రులకి దణ్ణం పెట్టాలిట. టీచర్ చెప్పారు"

"ఆయనలా చేస్తున్నాడో లేదో."

మధ్యాహ్నం స్కూలునించి ఏడుస్తూ



తనలో తృప్తిని చూసుకోలేనివాడు ఎక్కడా తృప్తిని పొందలేడు.

—రోచ్ ఫెకాల్డ్

* * *

స్వర్గంలో స్పష్టంగా గంటలా మ్రోగేవే సత్కార్యాలు.

—రిచర్

* * *

తప్పు ఒకే పక్షం వైపు వుంటే కీచులాటలు ఎక్కువకాలం సాగవు.

—రోష్ ఫోకార్డ్

* * *

యువతి బాల్య రుగ్మతలన్నీ కుదిర్చే ప్లాసరు పట్టీ భర్త.

—మోలియర్

* * *

తన రహస్యాలనే కాకుండా ఇతరుల రహస్యాలను కూడా వెల్లడి చేసి ఇబ్బందులకు గురి అవుతాడు వాచాలుడు.

—రే

* * *

ఇతరుల వ్యవహారాలలో ఎక్కువగాను. స్వంత విషయాల్లో తక్కువగాను శ్రద్ధ చూపడమే ఆతురత.

—హెచ్. ఎల్. వేలాండ్

* * *

చేతకానివాళ్ళు అదృష్టంమీద ఆధారపడతారు. విజ్ఞులు, ధీరులు కార్యకారణ భావమే గమనిస్తారు.

—బల్వర్

సేకరణ : వంగల బాలనరసింహారెడ్డి

వచ్చాడు రాంబాబు. మీరు తల్లితండ్రులకి నమస్కరిస్తున్నారా అని అడిగినందుకు టీచర్ కొట్టాట.

"మా టీచర్ దుర్మార్గుడు. దుందుభి. వాల్మీకి. రాక్షసుడు" నోటికొచ్చిన పెద్ద మాటలన్నీ అనేసి స్కూల్ మానేస్తానన్నాడు రాంబాబు. వసుంధరకి ఫక్కున

నవ్వొచ్చింది కొడుకు మాటలు విని. వాడు దుర్మార్గుల లిస్టులో వాల్మీకిని కూడా చేర్చినందుకు. అర్థం తెలీకుండా గంభీరంగా మాట్లాడానికి పెద్ద వాళ్ళకే హక్కు అనుకునే తల్లికి తన కొడుకు అంత వాడన్నందుకు మురిపెం కాదూ! వాణ్ణి రెండు నిముషాల్లో ఊరడించి నవ్వేలా చేసింది వసుంధర.

ఇంటికి "మగ దక్షత" అయిన రాంబాబు చాలా తీవిగా, గంభీరంగా వుండటానికి ప్రయత్నించేవాడు. రోజూ జమిందారుగారు చందాలు కట్టిన పత్రికలన్నీ క్షుణ్ణంగా చదివేవాడు వాడికీ. హైస్కూల్ టీచర్లకి పడేదికాదు. టీచరు బోధించే "ప్రపంచజ్ఞానం" వాడికి చాలా అవమానకరంగా, హీనంగా కనిపించేది. వాళ్ళు చెప్పే నీతులు వింటే ఇంకాఅసహ్యం వేసేది అడిగినవన్నీ వున్నంతలో పిల్లలకి సమకూర్చే వసుంధర, రాంబాబు కోరిక ఈ చిన కోరికను మాత్రం మన్నించలేకపోయింది. "అమ్మా ఇది నీ ఉద్దేశమా లేక నీ ఆజ్ఞా?" చాలా సీరియస్‌గా హిందీ సినిమా హీరో పోజు పెట్టి అడిగాడు రాంబాబు

"ఆజ్ఞ యేరా. నువ్వు మీ నాన్నగారిలా ఎస్సెల్సీ పూర్తి చేయాల్సిందే" వచ్చేనవ్వుని అణుచుకుంటూ అంది వసుంధర

రాంబాబుకి ఎస్సెల్సీ పాసవక తప్పలేదు.

* * *

"కాలేజీలో చచ్చినా చేరను. హైస్కూల్ టీచర్లు చవటలు; అంచేత కాలేజీ టీచర్లు చవటన్నరలు అయివుంటారు." అన్నాడు పదహారేళ్ళ రాంబాబు.

"తప్పురా. గురువుని పూజించుము అని వుందిగా శాస్త్రాల్లో" అంది తల్లి.

"అవును. పూజించాలనే ఉద్దేశంతోనే వాళ్ళకి దూరంగా ఉంటాననడం. వాళ్ళకి చూస్తే తెలుగు అక్షరాలు కూడా పూర్తిగా రావు. నా దగ్గర పోజు కొడతారు. నాకు మండుతోంది. టీచరుగా చేరితే ఉన్న తెలివి కూడా ఊడుతుందేమో మనుషులకి "

"తప్పు నాన్నా. లెంపలు వాయించుకో." బుద్ధిగా రెండు చెంపలూ మూడేసిసార్లు టప్ టప్ మని వాయించుకున్న రాంబాబుని కావిలించుకుని తల నిమిరింది వసుంధర.

"దైవం అంతటా ఉన్నాడని దైవానికే తెలుస్తుందమ్మా. నాకెలా తెలుస్తుంది?" అన్నాడు రాంబాబు రుద్ధమైన కంఠంతో.

రవి మాత్రం "బుద్ధిమంతుడు" స్కూల్లో అన్నీ ఫస్ట్ మార్కులే వాడికి.

రాంబాబు "రచయిత"గా బతకడానికీ, వీల్లేకపోతే రచయితగా చావడానికీ నిశ్చయించుకున్నాడు. బల్‌రాజ్ సహానీ,

తెల్ల వెంట్రుకలు

పొగడ్త కాదు, మా ఆయుర్వేద తైలము వాడుటవలన వెంట్రుకలు తెల్లబడుట ఆగిపోయి సమూలంగా నల్లగా మార్చును ఈ తైలము మెదడు మరియు కండ్ల బలహీనతలకు లాభదాయకమైనది వేలమంది ప్రజలు దీనిని వాడి, లాభము పొందియున్నారు ఒక సీసా వెల రు. 10/- 3 సీసాల వెల రు. 25/-పోస్టేజీ అదనం

JIWAN KALYAN ASHRM-9
P. O. KATRI SARAI (GAYA)

మహిళలకు వరప్రసాదిని

మగబిడ్డను పొందండి

అత్యద్భుతమైన చికిత్స. గర్భస్రావము జరగకుండాను. ఆడపిల్లలు కాకుండా మగబిడ్డలు కలిగేలా చేయును వేలాది మంది ఫలితం పొందారు. మగ బిడ్డలను పొందగలిగారు. ఇది స్త్రీల పాలిట వరప్రసాదిని ధర శాంపిల్ రు 15/-

Shrimati Rampyari Devi
P. o. KATRI SARAI (GAYA)

కన్స్యూమర్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా
సర్వే రిపోర్టు ద్వారా వెల్లడయింది:

కేవలం మూలికలు వళ్ళను పంటి జబ్బుల నుండి కాపాడును.

ఒక్క నీమ్ టూత్‌పేస్ట్‌కి మాత్రం నీమ్ (వేప) యొక్క మూలికల, ఔషధ లక్షణాలున్నాయి

యీ సర్వేకి సంబంధించిన కొంత మంది దంత చికిత్సదారుల అభిప్రాయంలో పేరొందిన టూత్‌పేస్ట్‌లు కేవలం పళ్ళను స్వచ్ఛంగా చేస్తాయి. కాని యిగుళ్ళ, పళ్ళరోగాలను అరికట్ట లేవు. ఎందుకనగా వాటిలో మూలికల లక్షణాలు ఉండవు. యీ సర్వేలో చెప్పబడిని దేమంటే, నీమ్ [వేప] గింజల నూనె నుండి చేయబడిన నీమ్ టూత్‌పేస్ట్ దాని మూలికల, ఔషధ లక్షణాల వల్లనోటి యొక్క దుర్గంధం పోగొట్టి, పళ్ళ, యిగుళ్ళను సురక్షితంగా ఉంచును.

కోరిన వారికి వివరాలు పంపబడును




IDL/MGN/1 Te

పళ్ళను, యిగుళ్ళను సురక్షితంగా ఉంచేందుకు అమోఘమైన టూత్‌పేస్ట్-నీమ్

కలకత్తా కెమికల్ వారి ఉత్పాదన

అబ్బాస్. శైలేంద్ర. హెరాల్డ్ రాబిన్స్. ముళ్ళపూడి అతని హీరోలు.

*　　*　　*

వసుంధర స్వతంత్ర జీవనపోరాటం అలా ఇరవై ఏళ్ళు సాగింది. ఇప్పుడు రాంబాబు సినిమా రచయిత, సహాయ దర్శకుడు. కో ప్రొడ్యూసరూ అయ్యాడు ఓ ఫిలిం ప్రొడక్షన్ సంస్థలో.

వసుంధర దూరమయ్యాకా పుట్టింటి వాళ్ళు ఆమెని ప్రేమగా తలుచుకోసాగారు. ఇంట్లో మంచీ, చెడూ సందర్భాల్లో ఆమెకు పిలుపులు వస్తుండేవి. వీలు కుదిరితే వెళ్ళి పిల్లల చదువు నెపంతో ఓ పూటకూడా ఉండకుండా వచ్చేసేది వసుంధర. ఆమె తల్లీ తండ్రీ చాలా రోగాల వాతపడి పిల్లలకి నరకం రుచి చూపించి పరమపదించారు. వసుంధర అప్పుడు వెళ్ళి ఏడిచింది వాళ్ళ మీద జాలితో!

*　　*　　*

తన వాళ్ళందరికీ తనింటికి తప్పకుండా రావాలంటూ ఆహ్వానం పంపించింది వసుంధర. అందరూ వచ్చారు.

రాంబాబు సొంత ఇంటి ముందు ఆటోల్లో దిగి ఎదురుగా "ఇదేనా వీళ్ళిల్లు" అనుకుంటూ వచ్చిన చుట్టాలకి ఓ అమ్మాయి స్వాగతం ఇచ్చింది. రంగనాయకమ్మా. విమలా ఆ అమ్మాయిని ఎగాదిగా చూసి అలా వుండిపోయారు ఆమెనే చూస్తూ.

"అవును నేనే. నా పేరు అరుణతార."

చిరునవ్వుతో వాళ్ళని సోఫాల్లో కూర్చోపెట్టింది అరుణతార.

దిగ్భ్రాంతి నుంచి తేరుకుని బియ్యం గుట్ట మీద వాలిన పిచికల్లా ఆమెను ప్రశ్నల ముక్కులతో పొడవ సాగారు వాళ్ళు.

"మీరే ఆ సినిమా ఇన్నాళ్ళు ఆడ్డానికి కారణం. చాలా అద్భుతంగా, ఎంతో Experience వున్నట్లు నటించారు మొదటి సినిమాలోనే ఆకాశమంత ఎత్తుకి ఎగిరి—" విమల అంటుంటే-

"నటనకంటే ముఖ్యం అందం విమలా. ఈ మొముఖంలో ఎంత అమాయకపు టందం. వెన్నెల పులుముకున్నట్లు" అంది రంగనాయకమ్మ.

వాళ్ళ భర్తలుకూడా ఆడవాళ్ళు వూపిరాడక ఆగినప్పుడు తమ ప్రశంసలు కురిపిస్తున్నారు.

"హెలెన్ ఆఫ్ ట్రోయ్ కథ తెలుసుగా. ఆమెని గ్రీకులు ఎత్తుకుపోయినప్పుడు వేయి యుద్ధ నౌకలు వెళ్ళాయి వెనక్కి తేవడానికి The face that launched a thousand ships అంటారు. అరుణతారగారు అంతకంటే ఎక్కువ. ఆవిడది ది ఫేస్‌దట్ బ్రోక్ ఎ థౌజండ్ బాక్సాఫీస్ రికార్డ్సు." అన్నాడు ప్రకాశం.

తన గొడవలో పడిపోయి వసుంధర. రాంబాబుల ఊసే ఎత్తని బంధువుల్ని చూసి నవ్వుకుంటూ "నాదేముందిలెండి. అంతా ప్రొడ్యూసర్ల అదృష్టం. మీకు తెల్సుగా ఈ పిక్చర్‌లో మీ మేనల్లుడికి కూడా వాటా వుంది. ఏడు లక్షలు మిగుల్తాయిట ఆయనకి."

తనకి రాంబాబు అనే మేనల్లుడున్నట్లు బాగా గుర్తొచ్చిన ప్రకాశం "అదృష్టం అనకండీ. అదంతా మా చెల్లాయి పెంపకం చలవ. ఇంతకీ ఏళ్ళేరీ" అని గొంతెత్తి అమ్మా! వసూ, రాంబాబూ" అంటూ పిలిచాడు.

"వాళ్ళింట్లో లేరు. నేనూ ఇప్పుడే


**RAMAKRISHNA LUCKY CENTRE No. 2 (Regd) No. 6130**

Gandhi Chowk TANDUR-501 141, Dist : Hyd, A.P.

**రు. 28,000 వేలు గెలవండి!**　　ముగింపు తేది **25-4-78**

సొల్యూషన్ రిజల్టు 8-5-78 ఆంధ్రజ్యోతి డైలీలో

మొదటి బహుమతి రు. 15,000 వేలు, ఒక తప్పుకు బహుమతి రు. 8,000 వేలు

ఎక్కువ ఎంట్రీలకు రు. 2,000 కన్సొలేషన్ బహుమతి ఇవ్వబడును.

1 ఎంట్రీకి రు. 2-00 లు; 10 ఎంట్రీలకు రు. 18-00 లు; 25 ఎంట్రీలు రు. 40-00 లు; 50 ఎంట్రీలు రు. 80-00 లు

RAMAKRISHNA CONTEST PUZZLE NO. 1 TANDUR

ముగింపు : 25-9-77　ఫలితాలు : 13-10-77　ఆంధ్రజ్యోతిలో ఇచ్చినాము.

నమూనా

| | | | |
|---|---|---|---|
| 17 | 22 | 10 | 21 |
| 19 | 12 | 24 | 15 |
| 20 | 11 | 23 | 16 |
| 14 | 25 | 13 | 18 |

10 నుండి 25 వరకు

నిబంధనలు :


(1) 15 నుంచి 30 వరకుగల అంకెలు నిలువు, అడ్డము, మూలలు ఎటుకూడినా 90 తొంభై రావలెను. 2) రిజిస్ట్రాఫీసులో సీలు చెయబడిన కీ సొల్యూషన్‌తో సరిపోలని అంకె ఒక తప్పుగా లెక్కించబడును. 3) వాడిన అంకె వాడరాదు. తుడుపులు లేకుండా తెల్లకాగితంపై ఒక్కరు ఎన్ని ఎంట్రీలైనను పంపవచ్చును. 4) I.P.O. ద్వారాగాని U.R.D.D. ద్వారాగాని M.O. ద్వారాగాని రశీదు తప్పక జతపర్చాలి. 5) M.O రశీదులేని ఎంట్రీలు ముగింపు తరువాత చేరు ఎంట్రీలు పోటీకి తీసుకోబడవు. 6) విజేతల లిస్టు నెం. 3 ఫారములకు 25 పైసలు అడ్రస్ వ్రాసిన కవరు పంపవలెను.

కూపన్

| | | | |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |
| | | | |

15 నుంచి 30 వరకు

గమనిక : తుపాను బాధితులకు రు. 3,000 లు ఇవ్వబడును. మా ఆఫీసులో మేనేజరుగా పని చేయుటకు H. S. C. పాస్ అయిన స్త్రీలు కావలెను. తమ దరఖాస్తు స్వంత ఫొటోతో తేదీ 8-5-78 వరకు పంపవలెను.




వచ్చాను రమ్మని ఫోన్ చేస్తే అడయార్‌లో ఓ సన్మానసభ వుంటే అక్కడికెళ్ళారు."

"సన్మానం వాడికయితే ఇది కూడా వెళ్ళటం ఎందుకూ? అందరూ పెద్ద పెద్ద వాళ్ళు వస్తారు. వాళ్ళ మధ్యకి?"

"మీకు తెలీదు కదూ. రాంబాబుగారు వాళ్ళమ్మ లేకుండా ఏ సన్మానాలకీ. సభలకీ. ప్రీవ్యూలకీ ప్రారంభోత్సవాలకి వెళ్ళరు. ఆయన్ని కట్టుకుని నేనేం సుఖపడతానో నాకు తెలీడంలేదు" సున్నితంగా హాస్యంగా, నిరాశ ప్రకటించింది అరుణ.

"ఓ! కంగ్రాచ్యులేషన్స్. రాంబాబు అదృష్టవంతుడు" అందరూ హర్షం ప్రకటించారు వాళ్ళ హర్షం బారినుంచి బయట పడ్డానికి "వుండండి కాఫీ చేయించి వస్తాను" అని లోనికి పరుగెత్తింది అరుణ.

వాళ్ళేదో గుస గుస లాడుతుండగా గేటు లోంచి కారు వచ్చి పోర్టికోలో అరుణ కారు వెనక ఆగింది. రాంబాబు తన వాళ్ళని చూసి నవ్వుతూ "హై" అని ఓ గ్రీటింగ్ విసిరేసి "అరుణా అరుణతారా ఓ సారి భూమి మీదకు వస్తావా" అని సినిమా హీరోలా అరవసాగాడు. ఆమె రాకపోతే ఒకనాటి ఆత్రేయ పద్ధతిలో "అరుణా అరుణా ఓ సారి ఓ సారి భూమి మీదకి భూమి మీదకి –" అని మళ్ళీ మొదలెట్టాడు.

కాఫీ కప్పులతో నిండిన ట్రేని మోస్తూ వయ్యారంగా వస్తున్న అరుణతారని చూసి "డార్లింగ్. ఆ ట్రే కిందపడేయ్. డ్రమెటిక్‌గా వుంటుంది .... అర్జెంటు పనుంది. అమ్మవారి గుడికి వెళ్ళి కుంకం తెచ్చాం. తీసి బొట్టు పెట్టుకో," అని జేబులోంచి ఓ ప్లాస్టిక్ కుంకుమ భరిణ తీశాడు. మూత తీసి భరిణ అందించబోయాడు.

అరుణతార అందుకోలేదు. అన్నతో మాట్లాడుతున్న వసుంధరవేపు చూస్తూ "బొట్టు నెనెలా పెట్టుకుంటాను. అలవాటు పోయి మూడేళ్ళయింది. పిక్చర్లో కూడా అల్ట్రా మోడర్న్ అమ్మాయి వేషం కనుక. అక్కడా అవసరం రాలేదు. ఆనవాయితీ పోయింది. ఆవిడ తన చేత్తో నాకు బొట్టు పెడితే తప్ప అమంగళం అవుతుంది" అంది.

"నాకూ ఇష్టమే కాని, అమ్మకి ఏ వుద్దేశం వుందో" అన్నాడు రాంబాబు.

అవునూ, కాదూ అని బొట్టు గురించి వాదించుకుంటున్న ఆ జంటని చూసి చుట్టాలు ఏమిటో అర్థంకాక అన్ని వేపులా చూసేస్తున్నారు.

వసుంధర వణుకుతున్న చేతుల్తో కుంకుమ భరిణ అందుకుని. చిటికెడు ఎర్ర కుంకుమ అరుణతార నొసటన వుంచింది. భుజాన్నున్న కెమెరాతో ఫొటో తీశాడు రాంబాబు.

వెంటనే అక్కడ సోఫాలో కూలబడిన తల్లి పాదాల వద్ద కూర్చుని ఆమె ఒళ్ళో తల దాచుకునే మిషతో కన్నీళ్ళని కూడా దాచుకున్నాడు రాంబాబు.

అరుణతారకి కూడా ఏడుపొచ్చింది. "నాకూ, రాంబాబుగారికీ పెళ్ళి కదూ ఈ రోజు. మీకు ప్లెజంట్ సర్‌ప్రైజ్ ఒకటి బహూకరించాలని ఆయన మీకు శుభలేఖ కూడా పంపలేదు. అర్జెంటుగా రమ్మని ఊరుకున్నారు. శుభలేఖల్లో చిరంజీవి సౌభాగ్యవతి అని రాయాలికదా. నేను మూడేళ్ళ క్రితం చిరంజీవి సౌభాగ్యవతి పదవికి అర్హత పోగొట్టుకున్నాను ఎందుకంటే అంతవరకూ నాకు ఓ భర్త వుండేవాడు. ఓ రోజున చచ్చిపోయాడు. అప్పుడు నాకు ఇరవై ఏళ్ళు. అంతక్రితమే నాకూ ఆయనకి రాంబాబుగారు ఫ్రెండే."

"రాంబాబుగారు హేండ్‌గ్రినేడ్‌లాంటి మనిషి. ఎప్పుడు పేలుతుందో తెలీదు గ్రెనేడ్‌ని చూసే ముద్దుగా పండులా వుంటుంది ఫ్యూజ్ విరిచి విసిరేదాకా. ఆయన నన్ను పెళ్ళాడతాడని నాకూ అనుమానం రాలేదు."

"మొగుడు అనే ఒక్క మనిషితోబాటుగా సూర్యుడూ. చంద్రుడూ, భూమీ. ఆకాశం, నాలోని హృదయం. రక్తం. నాడులూ అన్నీ చచ్చిపోయాయనుకునే పిచ్చిముండని బలవంతంగా సినిమాల్లోకి లాగారు ఆయన. మీరు నా సినిమా చూశారుగా. నా మొహం ఎలా వుంది అందులో. బాగుందా కాఫీ చల్లారిపోతుందేమో తాగేయండి. నా మొహంలా వుందా కాఫీ?" కిలకిలా నవ్వింది మిసెస్ అరుణతారా, రాంబాబు.

★

ఫూర్తి జీవితానికి
అసాధారణమైన బలం

జీవనానికి మరింత కుతూహలాన్ని చేకూర్చి పెడుతుంది. ఒకాసా మీ శరీరంలో బలం. శక్తి తిరిగి సమకూర్చటానికి ఇందు శక్తివంతమైన 6 రసాయనిక పదార్థాలు. 6 ఖనిజములు. 10 అత్యావశ్యకమైన విటమినులు, అశ్వగంధ. యొహింబైన్ వంటి మొక్కల సారములు ఇమిడి వున్నాయి. ఒకాసా తీసుకోండి.
జీవితం ఆనందమయమౌతుంది.

ఒకాసా
టానిక్ బిళ్ళలు

ఒకాసావారి ఉచిత పుస్తకం కోసం వ్రాయండి :
OKASA CO. PVT. LTD.
12K. Gunbow Street,
P.O. Box No. 396,
Bombay 400 001




02